# ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి

## రాష్ట్రం లోపలి ప్రసారణ మరియు పంపిణీ నెట్ వర్క్ుల ఓపెన్ యాక్సెస్ కొరకు నిబంధనలు మరియు షరతులు

## 2005 లోని 2వ నిబంధన

**(ఆంధ్రప్రదేశ్ అసాధారణ రాజపత్రము భాగము-2 లో జూలై 1, 2005 న ప్రచురించబడినది)**

నిర్వహణలోని ఇబ్బందులతో సహా సంబంధిత విషయాలను పరిగణన లోనికి తీసుకొని రాష్ట్ర మండలి నిర్ణీత పరచే షరతులకు లోబడి ఓపెన్ యాక్సెస్ ను దశల వారీగా ప్రవేశపెట్టడం, కేంద్ర విద్యుత్ చట్టం, 2003 యొక్క 42వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) ప్రకారం తప్పనిసరి. వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయుటకు ఓపెన్ యాక్సెస్ కొరకు నిబంధనలు, షరతులపై మండలి ఒక ముసాయిదా నిబంధనను తయారుచేసింది. దీనిని ఆంధ్రప్రదేశ్ రాజపత్రములో ది.4.8.2004 న ప్రచురించి మరియు మండలి వెబ్ సైటులో కూడా ఉంచి ఆసక్తి గల వ్యక్తుల నుండి అభిప్రాయములను/సూచనలను కోరడమైనది. ఒక అనుమతిదారు, కొన్ని ఉత్పాదన కంపెనీలతో సహా 23 మంది వ్యక్తులు/సంఘాలు ముసాయిదా నిబంధనపై వారివారి అభిప్రాయములను/సూచనలనూ తెలియజేశారు. మండలి సదరు అభిప్రాయములను/ సూచనలనూ పరిశీలించి నిబంధనను ఖరారు చేయడమైనది.

కేంద్ర విద్యుత్ చట్టము, 2003(2003 లోని 36వ చట్టము) యొక్క పరిచ్ఛేదములు 39 (2)(డి) (ii); 40(సి) (ii); 42(2); 42(4) మరియు 181(1) ల ద్వారా లభించిన అధికారములను మరియు ఈ విషయంలో వీలు కల్పించే అన్ని ఇతర అధికారములను వినియోగిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఈ క్రింది నిబంధనను జారీ చేయడమైనది:

## <u>ప్రధాన నిబంధనకు సవరణ నిబంధన 1/2016</u>

**<u>(ఆంధ్రప్రదేశ్ అసాధారణ రాజపత్రము 2వ భాగంలో 8.1.2016 న ప్రచురించబడినది)</u>**

**<u>ఉపోద్ఘాతం:</u>**

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఇందులో ఇటు పిమ్మట మండలి అని పేర్కొనబడును),ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఓపెన్ యాక్సెస్ కొరకు

నిబంధనలు మరియు షరతులు) నిబంధన,2005 (2005 లో 2వ నిబంధన) ను జారీచేసి ఆంధ్రప్రదేశ్ అసాధారణ రాజపత్రములో 1.7.2005 తేదీన ప్రకటించడమైనది.

సదరు ప్రధాన నిబంధన 2/2005లో, ఉత్పాదన కంపెనీలు మరియు అనుమతిదారులతో సహా వాడకందారులు ఓపెన్ యాక్సెస్ ను ఉపయోగించుకొనుటకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనుమతిదారులు మరియు ఓపెన్ యాక్సెస్ వాడకందారుల కొరకు మార్గదర్శకములు ఉన్నవి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, ఇతర విషయాలతోపాటుగా, విద్యుత్ భద్రత మరియు పరిశుద్ధమైన విద్యుత్తు ఉత్పత్తి వంటి రెండు లక్ష్యాలను సాధించటానికి గాను, గతంలో ఉన్న సౌర విద్యుత్ విధానము, 2012 మరియు పవన విద్యుత్ విధానము, 2008 లను అధిగమిస్తూ, వాటికి బదులుగా 12.2.2015 తేదీన జి.ఓ.ఎమ్.ఎస్.నం.8 లో కొత్త సౌర విద్యుత్ విధానము, 2015 ను మరియు 13.2.2015 తేదీన జి.ఓ.ఎమ్.ఎస్.నం.9 లో కొత్త పవన విద్యుత్ విధానము, 2015 ను జారీచేసినందుననూ;

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తమ లేఖ నం.348/పవర్ II(2)/2015 తేదీ 9.3.2015 లో విద్యుత్ చట్టము, 2003 లో గల 108వ పరిచ్ఛేధములోని నిబంధనలను పేర్కొంటూ, ఆంధ్రప్రదేశ్ సౌర విద్యుత్ విధానము, 2015 మరియు ఆంధ్రప్రదేశ్ పవన విద్యుత్ విధానము, 2015 లను అనుసరించి వాటిని అమలు లోనికి తెచ్చుటకు గాను అవసరమైన నిబంధనలను/ఉత్తరువులను జారీ చేయవలసినదిగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలిని కోరినందుననూ;

పైన తెలిపిన విధానాలలో, ఇతర విషయాలతోపాటు, ఈ క్రింది అంశములు/కొల ప్రమాణములకు సంబంధించి కొన్ని ప్రోత్సాహకములు ఉన్నవి. ఇవి మండలి పరిధిలోనికి వస్తున్నవి. ఈ విధానాలను అమలు పరచే కాలంలో, అనగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సౌర విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి 12.2.2015 నుండి 11.2.2020 మధ్య కాలంలో మరియు పవన విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి 13.2.2015 నుండి 12.2.2020 మధ్య కాలంలో ప్రారంభమైన సౌర మరియు పవన విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రస్తుత నిబంధనలకు సవరణలు చేయవలసిన అవసరం ఉన్నది.

(ఏ) <u>విద్యుత్తు వీలింగు కొరకు ప్రసారణ మరియు పంపిణీ ఛార్జీలు:</u>

(i) పేరా 4 (ఏ), సౌర విద్యుత్ విధానము, 2015:

సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుండి ఉత్పత్తి అయిన విద్యుత్తును కేవలము క్యాప్టివ్ వినియోగము కొరకు/రాష్ట్రం లోపల మూడవ వ్యక్తికి అమ్మకము కొరకు చేసే వీలింగుకు ప్రసారణ మరియు పంపిణీ చార్జీలను మినహాయించవలెను.

(ii) పేరా 8 (బి), పవన విద్యుత్ విధానము, 2015:

పవన విద్యుత్ ప్రాజెక్టుల నుండి ఉత్పత్తి అయిన విద్యుత్తును క్యాప్టివ్ వినియోగము కొరకు **కోరుకొన్న** స్థలము (ల) కు / రాష్ట్రం లోపల మూడవ వ్యక్తికి అమ్మకము కొరకు గ్రిడ్ ద్వారా చేసే వీలింగుకు ప్రసారణ మరియు పంపిణీ ఛార్జీలు ఉండవు. అయితే, సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుండి ఉత్పత్తి అయిన విద్యుత్ ను రాష్ట్రం వెలుపల అమ్మకముల కొరకు చేసే వీలింగుకు, ప్రసారణ మరియు పంపిణీ ఛార్జీలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి యొక్క నిబంధనల ప్రకారం ఉండవలెను. ఈ విధానము క్రింద అర్హులైన అభివృద్ధిదారులచే మూడవ వ్యక్తికి అమ్మకము, ట్యారిఫ్ ఉత్తరువులలో వర్గీకరించబడిన ప్రకారం మరియు ఏ.పి.ఇ.ఆర్.సి. ఎప్పటికప్పుడు జారీచేసిన నిబంధనల ప్రకారం, హెచ్.టి.-1 తరగతి వినియోగదారులకు మాత్రమే అనుమతించబడును.

(బి) <u>పంపిణీ నష్టాలు:</u>

<u>పేరా 4 (బి), సౌర విద్యుత్ విధానము, 2015:</u>

డిస్కమ్ పరిధి లోపల విడుదల స్థానము వద్ద వోల్టేజి స్థాయితో సంబంధం లేకుండా 33 కె.వి. లేక అంతకు లోపల విద్యుత్తును అందిస్తున్న సౌర విద్యుత్ ప్రాజెక్టులకు మాత్రమే పంపిణీ నష్టాలను మినహాయించవలెను.

(సి) <u>ఓపెన్ యాక్సెస్:</u>

పేరా 4 (డి), సౌర విద్యుత్ విధానము, 2015 మరియు పేరా 8 (డి), పవన విద్యుత్ విధానము, 2015:

ఏ.పి.ఇ.ఆర్.సి. నిబంధనలు, ఎప్పటికప్పుడు సవరించబడిన ప్రకారం, రాష్ట్రం లోపల ఓపెన్ యాక్సెస్ అనుమతిని ప్రాజెక్టు యొక్క పూర్తి గడువు వరకు లేక 25 సంవత్సరముల వరకు, ఇందులో ఏది తక్కువ అయితే అంతవరకూ మంజూరు

చేయవలెను. నోడల్ ఏజెన్సీ నుండి ఉత్పాదకునికి 21 దినముల లోపల ఏవిధమైన స్పందన లేక సమాచారము లేని సందర్భములో అట్టి దరఖాస్తును భావింపబడు ఓపెన్ యాక్సెస్ కొరకు పరిగణించవలెను.

(డి) **క్రాస్-సబ్సిడీ సర్ చార్జి:**

పేరా 4 (ఎఫ్), సౌర విద్యుత్ విధానము, 2015

తృతీయ వ్యక్తికి అమ్మకమునకై క్రాస్-సబ్సిడీ సర్-చార్జీని మినహాయించవలెను. అయితే, రాష్ట్రం లోపల ఏర్పరచిన సౌర విద్యుత్తు ప్రాజెక్టుల నుండి పొందే విద్యుత్తుకు మాత్రమే, ప్రోజెక్టు ప్రారంభమైన తేదీ నుండి 5 సంవత్సరముల వరకూ మినహాయింపు వర్తించును.

తదనుసారంగా, మండలి, ముసాయిదా నిబంధనను తమ వెబ్ సైటులో ది.27.8.2015న ప్రచురించి, లబ్దిదారుల నుండి / ఆసక్తి గల వ్యక్తుల నుండి వారి సూచనలు / అభిప్రాయములు / సలహాలను ఆహ్వానించడమైనది. మండలి, ది.19.12.2015 న బహిరంగ విచారణను కూడా నిర్వహించడమైనది.

బహిరంగ విచారణలోను, మండలికి అందిన వ్రాతపూర్వకమైన అభిప్రాయముల ద్వారాను, సౌర మరియు పవన విద్యుత్ అభివృద్ధిదారుల నుండి మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నుండి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సౌర మరియు పవన విద్యుత్ విధానములు జారీ అయిన తేదీల నుండి వర్తించే విధంగా కొత్త నిబంధనను తయారు చేయవలెనని అనేక అభ్యర్ధనలు అందినవి.

అందిన సూచనలు / అభిప్రాయములు / సలహాలను మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన అభ్యర్ధననూ దృష్టి యందుంచుకొని కేంద్ర విద్యుత్ చట్టము, 2003 (2003 లోని 36వ కేంద్ర చట్టము) లోని 39 (2) (డి) (ii); 40 (సి) (ii); 42 (2); 42 (3); 42 (4), 86 (1) (ఇ) మరియు 181 (1) పరిచ్ఛేదముల ద్వారా లభించిన అధికారములను మరియు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణ చట్టము, 1998 (1998 లోని 30వ రాష్ట్ర చట్టము), ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టము, 2014 (2014 లోని 6వ కేంద్ర చట్టము) ల ద్వారా లభించిన అధికారములతో సహా, ఈ విషయములో తమకు వీలుకలిగించే అన్ని అధికారములనూ వినియోగిస్తూ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి, ప్రధాన నిబంధనకు, అనగా, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఓపెన్ యాక్సెస్

కొరకు నిబంధనలు మరియు షరతులు) నిబంధన, 2005 (2005 లో 2వ నిబంధన) కు ఈ సవరణలను జారీ చేయడమైనది:--

## <u>ప్రధాన నిబంధన 2/2005</u>

**(సవరణ నిబంధన ను ప్రధాన నిబంధనలో పొందు పరచడమైనది)**

**1. <u>సంగ్రహ నామము, ప్రారంభము, అన్వయము:</u>**

(ఏ) ఈ నిబంధనను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఓపెన్ యాక్సెస్ కొరకు నియమాలు మరియు షరతులు) నిబంధన, 2005 అని పిలువవచ్చును.

(బి) ఈ నిబంధన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటికీ వర్తించును.

(సి) ఈ నిబంధన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో అది ప్రచురించబడిన తేదీన అమలులోనికి వచ్చును.

(డి) భారత ప్రభుత్వ ఇంధన మంత్రిత్వ శాఖ, భారత రాజపత్రము యొక్క 2వ అసాధారణ భాగములో జూన్ 8, 2005 తేదీన ప్రకటించిన విద్యుత్ (ఇబ్బందులను తొలగించుట) రెండవ ఉత్తరువు, 2005 తో పాటుగా ఈ నిబంధనను కలిపి చదువవలెను.

**2. <u>నిర్వచనములు:</u>**

ఈ నిబంధనలో సందర్భమును బట్టి వేరే అర్ధము ఉన్ననే తప్ప;--

(ఏ) "చట్టము" అనగా కేంద్ర విద్యుత్ చట్టము, 2003 (2003 లోని 36వ చట్టము) అని అర్ధము;

(బి) "దరఖాస్తుదారుడు" అనగా ఓపెన్ యాక్సెస్ కొరకు నోడల్ ఏజెన్సీ కి దరఖాస్తు చేయు వ్యక్తి అని అర్ధము. ఇందులో విద్యుత్ ఉత్పాదన చేయు **ఎవరేని** వ్యక్తి, అనుమతిదారుడు లేక ఈ నిబంధన క్రింద ఓపెన్ యాక్సెస్ కొరకు అర్హుడైన ఎవరేని వినియోగదారుడు చేరియుండును;

(సి) "అందుబాటులో ఉన్న సామర్ధ్యము" అనగా విద్యుత్తును ఒక పాయింటు నుండి మరొక పాయింటుకు తరలించుటకు గాను మెగా వాట్లలో (ఏం.డబ్ల్యు.) లేక కిలో వాట్లు (కె.డబ్ల్యు.) లో గాని ప్రసారణ లేక పంపిణీ నెట్ వర్కుకు ఉన్న సామర్ధ్యము అని అర్ధము;

(డి) "మండలి" అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అని అర్ధము;

(ఇ) "ఒప్పందపు సామర్ధ్యము" అనగా వినియోగదారులకు సరఫరా చేయుటకు ఓపెన్ యాక్సెస్ సందర్భంలో ఓపెన్ యాక్సెస్ ద్వారా వినియోగదారునికి ప్రసారణ మరియు / లేక వీలింగు కొరకు మెగా వాట్లు (ఎమ్.డబ్ల్యు.) లేక కిలో వాట్లు (కె.డబ్ల్యు.) లో ఒప్పందము చేసుకొన్న సామర్ధ్యము అని అర్ధము;

(ఎఫ్) "ఓపెన్ యాక్సెస్ ఒప్పందము" అనగా ఓపెన్ యాక్సెస్ ద్వారా విద్యుత్ ప్రసారణ మరియు /**లేక** వీలింగు కొరకు అనుమతిదారుని యొక్క నెట్ వర్క్ను వినియోగించుకొనుటకు దరఖాస్తు చేసుకొన్న వ్యక్తి మరియు అనుమతిదారుని మధ్య కుదుర్చుకొన్న ఒప్పందము అని అర్ధము;

(జి) "ప్రవేశ స్థానము" అనగా విద్యుత్ ప్రసారణ నెట్ వర్క్ లోనికి లేక **విద్యుత్** పంపిణీ నెట్ వర్క్ లోనికి విద్యుత్తును ప్రవేశపెట్టే స్థానము అని అర్ధము;

(హెచ్) "నిష్క్రమణ స్థానము" అనగా విద్యుత్ ప్రసారణ నెట్ వర్క్ నుండి లేక విద్యుత్ పంపిణీ నెట్ వర్క్ నుండి విద్యుత్తును తీసుకొనే స్థానము అని అర్ధము;

(ఐ) "నోడల్ ఏజెన్సీ" అనగా ఈ నిబంధనలోని 5వ ఖండము లో పేర్కొన్న సంస్థలు అని అర్ధము;

(జె) "వాడకందారు" లేక "ఓపెన్ యాక్సెస్ వాడకందారు" అనగా తన సరఫరా ప్రాంతంలోని పంపిణీ అనుమతిదారుని నుండి కాకుండా ఇతర వ్యక్తి నుండి విద్యుత్ సరఫరాను పొందుటకు రాష్ట్రంలోని అనుమతిదారుల యొక్క ప్రసారణ వ్యవస్థను మరియు/లేక పంపిణీ వ్యవస్థను వినియోగించుకొనుచున్న లేక వినియోగించదలచిన వ్యక్తి అని అర్ధము. ఈ పదబంధములో ఉత్పాదన కంపెనీ మరియు అనుమతిదారుడు చేరియుండును.

(కె) ఈ నిబంధనలో ఉపయోగించబడి నిర్వచించబడని పదములు, పదబంధములు చట్టములో నిర్వచించబడినట్లయితే అవే అర్ధములను అవి కలిగి యుండును. చట్టములో కూడా అవి నిర్వచించబడనట్లయితే, విద్యుత్ సరఫరా పరిశ్రమలో సాధారణముగా వాటికి ఉన్న అర్ధములనే అవి కలిగి యుండును.

**3. వర్తింపు:**

ఈ నిబంధన, రాష్ట్రంలోని అనుమతిదారులకు చెందిన ప్రసారణ మరియు పంపిణీ వ్యవస్థలను ఓపెన్ యాక్సెస్ కొరకు వినియోగించుటలో వర్తించును. అట్టి వ్యవస్థలను

అంతర్ రాష్ట్ర ప్రసారణ వ్యవస్థలకు అనుసంధానము చేసి వాడుచున్నప్పుడు కూడా ఈ నిబంధన వర్తించును.

**4. ఓపెన్ యాక్సెస్ వాడకందార్ల వర్గీకరణ :**

ప్రసారణ మరియు/లేక పంపిణీ వ్యవస్థల ఓపెన్ యాక్సెస్ వాడకందార్లను ఈ క్రింది విధంగా వర్గీకరించవలెను:

(ఏ) దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారు:

సంబంధిత అనుమతిదార్లతో రెండు సంవత్సరముల కంటే మించి ఓపెన్ యాక్సెస్ ఒప్పందము కుదుర్చుకొనే ప్రసారణ మరియు/లేక పంపిణీ వ్యవస్థల వాడకందారును దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారుగా వర్గీకరించవలెను.

(బి) స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారు:

సంబంధిత అనుమతిదార్లతో ఓపెన్ యాక్సెస్ ఒప్పందము కుదుర్చుకునే ప్రసారణ మరియు/లేక పంపిణీ వ్యవస్థల దీర్ఘకాలిక వాడకందారు కాని ఇతర వ్యక్తిని స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారుగా వ్యవహరించవలెను. అయితే, ఓపెన్ యాక్సెస్‌ను ఒక పర్యాయమునకు ఒక సంవత్సరము కంటే మించి అనుమతించరాదు.

**5. నోడల్ ఏజెన్సీ:**

5.1 దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ వ్యవహారములలో దరఖాస్తులు స్వీకరించి ప్రాసెస్ చేయుటకు రాష్ట్ర ప్రసారణ సంస్థ (ఎస్.టి.యు.) నోడల్ ఏజెన్సీ గా ఉండవలెను.

5.2 స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వ్యవహారములలో దరఖాస్తులు స్వీకరించి ప్రాసెస్ చేయుటకు రాష్ట్ర లోడు విడుదల కేంద్రము (ఎస్.ఎల్.డి.సి.) నోడల్ ఏజెన్సీ గా ఉండవలెను. అయితే రాష్ట్ర లోడు విడుదల కేంద్రము, స్వల్ప కాలిక ఓపెన్ యాక్సెస్ వ్యవహారములలో, అట్టి వ్యవహారములకు ఎవరి నెట్ వర్క్ ఉపయోగించబడినదో అట్టి సంబంధింత ప్రసారణ మరియు/లేక పంపిణీ అనుమతిదారులను సంప్రదించిన తరువాత మాత్రమే స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వ్యవహారములను అనుమతించవలెను:

అయితే, ఒక వారము లోపు వ్యవధికి చెందిన స్వల్పకాలిక వ్యవహారములలో ఎస్.ఎల్.డి.సి. అట్టి వ్యవహారములను అనుమతించుటకు సంబంధిత

అనుమతిదారులను సంప్రదించకపోవచ్చును. అట్టి స్వల్పకాలిక వ్యవహారములను అనుమతించుట కొరకు ఎస్.ఎల్.డి.సి. మరియు అనుమతిదారులు వారిలో వారికి సమన్వయము కొరకు కార్యవిధానములను రూపొందించుకొనవలెను.

**6**. <u>**ప్రసారణ మరియు/లేక పంపిణీ వ్యవస్థల ఓపెన్ యాక్సెస్ ను అనుమతించుటకు నిర్ణయ ప్రమాణాలు:**</u>

6.1 రాష్ట్ర గ్రిడ్ కోడు మరియు / లేక పంపిణీ కోడు మరియు / లేక భారత విద్యుత్ నియమాలలో నిర్ణయించిన ప్రసారణ ప్రణాళిక నిర్ణయాలు మరియు పంపిణీ ప్రణాళిక నిర్ణయాలననుసరించి దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ ను అనుమతించవలెను.

6.2 స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ కొరకు అభ్యర్థనను, ఈ క్రింది వాటిని ఉపయోగించి అంగీకరించగలిగినట్లయితే, ఓపెన్ యాక్సెస్ ను అనుమతించవలెను:

(ఏ) సహజ సిద్ధమైన డిజైను మార్జిన్లు;

(బి)విద్యుత్ ప్రవాహంలో వ్యత్యాసాలు మరియు వినియోగించుకొనని సామర్థ్యం మూలంగా లభించే మార్జిన్లు; మరియు

(సి) భవిష్యత్ లోడు పెరుగుదల కొరకు ఏర్పరచిన ప్రసారణ మరియు/లేక పంపిణీ వ్యవస్థలలోని మిగులు సామర్థ్యం మూలంగా లభించే మార్జిన్లు.

**7.** <u>**ప్రస్తుత వాడకందార్ల కొరకు నిబంధన:**</u>

7.1 <u>ప్రస్తుత పంపిణీ అనుమతిదారులు:</u>

ప్రస్తుత పంపిణీ అనుమతిదారులను, ప్రస్తుత ఒప్పందము (లు) లేక ఏర్పాటు (లు) లో / క్రింద నిర్దిష్ట పరచిన వ్యవధి వరకూ రాష్ట్రం లోపలి ప్రసారణ వ్యవస్థ (ల) మరియు / లేక పంపిణీ వ్యవస్థ (ల) దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారు (లు) గా భావించవలెను. వారు, వారికి వర్తించే విధంగా మండలి ఎప్పటికప్పుడు నిర్ధారించునట్టి ప్రసారణ చార్జీలను, వీలింగు చార్జీలను మరియు ఇతర చార్జీలను వారు చెల్లించవలెను.

రాష్ట్రం లోపలి ప్రసారణ వ్యవస్థ (ల) మరియు/లేక పంపిణీ వ్యవస్థ(ల) ను వినియోగించుకొన్న వివరములను ప్రస్తుత పంపిణీ అనుమతిదారు (లు) ఎస్.టి.యు., ఎస్.ఎల్.డి.సి. మరియు మండలికి ఈ నిబంధన అమలులోనికి వచ్చిన 60 దినములలోపల సమర్పించవలెను.

7.2 పంపిణీ అనుమతిదారులు కాకుండా ఇతర ప్రస్తుత వాడకందారులు:

ప్రస్తుత పంపిణీ అనుమతిదారులు కాకుండా ఇతర ప్రస్తుత వాడకందారులు, చట్టమునకు మరియు ఈ నిబంధనకు విరుద్ధముగాలేనంతవరకూ, ఒప్పందము(ల) లో నిర్దేశించిన సమయము(ల) వరకూ ప్రస్తుత ఒప్పందముల ప్రకారం వీలింగు సౌకర్యమును వినియోగించుకొనుటను కొనసాగించవచ్చును:

అయితే, ఆ విధమైన ప్రస్తుత వాడకందారు(లు), మండలి, ఆయా సమయములయందు నిర్ధారించినట్టి ప్రసారణ చార్జీలను, వీలింగు చార్జీలను, ఇతర చార్జీలను చెల్లించవలెను:

అంతేకాకుండా, ప్రస్తుత వాడకందారులు ఇంతకుముందే కుదుర్చుకొన్న ఒప్పందపు సామర్థ్యమునకు అదనముగా కోరుకొన్న సామర్థ్యమును ఆ విధంగా అదనంగా కోరుకొన్న సామర్థ్యం వరకూ ఓపెన్ యాక్సెస్ కు కొత్త దరఖాస్తుగా పరిగణించవలెను.

**8. ఓపెన్ యాక్సెస్ కు దశల వారీగా అనుమతి:**

8.1 ప్రసారణ మరియు/లేక పంపిణీ వ్యవస్థల ఓపెన్ యాక్సెస్ కొరకు ఎవరేని వాడకందారు కోరుకొన్నప్పుడు, నోడల్ ఏజెన్సీ ఈ క్రింద తెలిపిన దశల వారీగా ఓపెన్ యాక్సెస్ ను అనుమతించవలెను:

| దశ | అర్హతా ప్రమాణము | ప్రారంభ తేదీ |
|---|---|---|
| 1. | ఒప్పందపు సామర్థ్యపు పరిమాణంతో సంబంధం లేకుండా ఎన్.సి.ఇ. అభివృద్ధిదారుల నుండి విద్యుత్తును వినియోగించుకొనుచున్న వినియోగదారులు | సెప్టెంబరు, 2005 |
| 2. | ఒప్పందపు సామర్థ్యము 5 మె.వా. కంటే ఎక్కువ ఉన్నప్పుడు | సెప్టెంబరు, 2005 |
| 3. | ఒప్పందపు సామర్థ్యము 2 మె.వా. కంటే ఎక్కువ ఉన్నప్పుడు | సెప్టెంబరు, 2006 |
| 4. | ఒప్పందపు సామర్థ్యము 1 మె.వా. కంటే ఎక్కువ ఉన్నప్పుడు | సెప్టెంబరు, 2008 |

అయితే, నిర్వహణలో ఇబ్బందులను, ఇతర అంశములను దృష్టి యందుంచుకొని మండలి సాధ్యమని భావించినట్లయితే, ఒక మె.వా. లేక అంతకంటే తక్కువ ఒప్పందపు సామర్థ్యము కలిగిన వినియోగదారులకు క్రమంగా అట్టి సమయంలో, అట్టి దిశలలో ఓపెన్ యాక్సెస్ ను అనుమతించవలెను:

అంతేకాక, చట్టము యొక్క నిబంధనలకు విరుద్ధముగా కాకుండా, తాము అవసరమని భావించు విధముగా మండలి తదుపరి ఓపెన్ యాక్సెస్ దశల కొరకు పైన తెలిపిన షెడ్యూలును మార్చవచ్చును.

అంతేకాకుండా, మండలి, ప్రజా ప్రయోజనము దృష్ట్యా, అవసరము, ఉపయోగకరమని భావించినట్లయితే, ఏ వినియోగదారునైననూ, లేక వినియోగదారుల తరగతినైననూ ఈ దశల వారీ పథకము నుండి మినహాయించవచ్చును.

అంతేకాకుండా, ఈ నిబంధన అమలులోనికి వచ్చిన తేదీకి ముందునుండీ ఖండము 7.2 లో తెలిపిన ప్రస్తుత వాడకందారుల నుండి సరఫరాను వినియోగించుకొనుచున్న వినియోగదారులు మాత్రము పైన తెలిపిన దశల వారీ పథకము వలన ప్రభావితము కారాదు.

8.2 పైన తెలిపిన దశల వారీ ప్రణాళిక ప్రకారం, సందర్భానుసారంగా ప్రసారణ మరియు/ లేక పంపిణీ **వ్యవస్థలలో**, మీటరింగు, సమాచార వ్యవస్థలు, సామర్థ్య నిర్ధారణ వంటి నిర్వహణా ఇబ్బందులను తొలగించు విధంగా అనుమతిదారులు తగిన ప్రయత్నములు అన్నీ చేయవలెను. ఆ విధంగా, వీలైనంత వరకూ, అర్హుడైన ఏ వినియోగదారుడూ, వ్యవస్థలోని నిర్వహణ ఇబ్బందుల కారణంగా ఓపెన్ యాక్సెస్ కు తిరస్కరించబడడు.

## 9. సామర్థ్యపు కేటాయింపు / ప్రత్యేకింపు కొరకు ప్రమాణములు:

9.1 చట్టము యొక్క 43వ పరిచ్ఛేదము క్రింద అభ్యర్ధనపై సరఫరా చేయుట పంపిణీ అనుమతిదారుని బాధ్యత కావున, దీర్ఘకాలిక అదేవిధంగా స్వల్పకాలిక సామర్థ్యపు కేటాయింపు విషయంలో అనుమతిదారుడు అత్యధిక ప్రాధాన్యతను చూపవలెను.

9.2 ప్రసారణ మరియు/లేక పంపిణీ వ్యవస్థల సామర్థ్యపు కేటాయింపు కోరే ఇతర దరఖాస్తుదారులకు సంబంధించి, స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ కొరకు దరఖాస్తు చేసే వ్యక్తుల కంటే దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ కొరకు దరఖాస్తు చేసే వ్యక్తులకు ప్రాధాన్యతనీయవలెను. అయితే, ఒక తరగతి లోపల, ప్రసారణ మరియు / లేక పంపిణీ

యాక్సెస్ ను, స్వల్పకాల వ్యవధికి కోరే వ్యక్తుల కంటే దీర్ఘకాలిక వ్యవధికి కోరే దరఖాస్తుదారుకు ప్రాధాన్యతనీయవలెను.

9.3 <u>అదనపు సామర్థ్యము తగినంతగా లేని రద్దీ సందర్భంలో సామర్థ్యపు కేటాయింపు:</u>

9.3.1 <u>దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ దరఖాస్తుదారుల కొరకు:</u>

పంపిణీ వ్యవస్థలో అదనపు సామర్థ్యం తగినంతగా లేని/ప్రసారణ వ్యవస్థలో రద్దీ కారణంగా దీర్ఘ కాలిక ఓపెన్ యాక్సెస్ దరఖాస్తుదారులకు ఆటంకం ఏర్పడుతున్న సందర్భంలో, నోడల్ ఏజెన్సీ ఆ సమాచారమును దరఖాస్తుదారులకు తెలియజేసి, అట్టి దరఖాస్తుదారులందరికీ వీలు కల్పించుటకుగాను, వ్యవస్థను పటిష్ట పరచటం ద్వారా అదనపు సామర్థ్యాన్ని ఏర్పరచుటకు అవసరమైన పనులను అంచనా వేయుటకు సంబంధిత అనుమతిదారుకు సలహానీయవలెను. ఆ పనులు పూర్తి అయిన మీదట నోడల్ ఏజెన్సీ, ఆ దరఖాస్తుదారులకు సామర్థ్యమును కేటాయించవలెను. వ్యవస్థను పటిష్టం చేయుట కొరకు అనుమతిదారులకు అయిన పెట్టుబడి వ్యయమునకు సంబంధించి, అనుమతిదారులు, ఈ నిబంధనలోని ఖండము 17.1 (v) కు లోబడి దరఖాస్తుదారుల నుండి వారి పెట్టుబడి వాటాను కోరవచ్చును.

9.3.2 <u>స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ దరఖాస్తుదారుల కొరకు:</u>

నెట్ వర్కులో రద్దీగా ఉండే క్యారిడార్ల ద్వారా ప్రసారణ వ్యవహారాలకు వీలు కల్పించవలసియున్న స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ దరఖాస్తుదారుల విషయంలో, నోడల్ ఏజెన్సీ, రద్దీ లేని చోట్ల స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందార్లు చెల్లించే ధరకు సమానమైన కనిష్ట ధరతో, ఫ్యాక్స్/ఇ-మెయిలు ద్వారా బిడ్లను ఆహ్వానించవలెను. వేలంపాటదారులు కనిష్ట ధరపైన పాయింట్ల శాతంలో ధరను తెలుపవలెను. తెలిపిన ధర యొక్క తగ్గుదల క్రమంలో సామర్థ్యమును కేటాయించవలెను. తెలిపిన ధరలు సమానంగా ఉన్న సందర్భంలో, అవసరమైన యెడల, కోరిన సామర్థ్యపు దామాషాలో సామర్థ్యపు కేటాయింపును చేయవలెను. తాను కోరిన సామర్థ్యం కంటే తక్కువ సామర్థ్యమును కేటాయింపు పొందిన వాడకందారు, తాను తెలిపిన ధర ప్రకారం చార్జీలను చెల్లించవలెను. తాము కోరిన సామర్థ్యమును కేటాయింపు పొందిన ఇతర దరఖాస్తుదారులు మాత్రము కోరిన సామర్థ్యమును పూర్తిగా కేటాయింపు పొందిన చివరి దరఖాస్తుదారు తెలిపిన ధర ప్రకారం చార్జీలను చెల్లించవలెను.

వివరణ-1: ఖండములు 9.3.1 మరియు 9.3.2 యొక్క ప్రయోజనముల నిమిత్తము, విద్యుత్ ప్రసారణ కొరకు సామర్ధ్యపు కేటాయింపు విషయంలో "రద్దీ" ని ప్రసారణ వ్యవస్థలో భౌతికపరమైన లేక సాంకేతిక పరమైన పరిమితుల కారణంగా వాడకందార్లు సాధారణముగా జరిపే ప్రసారణ వ్యవహారములన్నింటిని అనుమతించలేకపోవు పరిస్థితిగా భావించవలెను.

వివరణ-2: ఖండము 9.3.2 యొక్క ప్రయోజనము నిమిత్తము, "రద్దీ లేని చోట ధర" అనగా మండలి ఆమోదముతో నోడల్ ఏజెన్సీ ప్రచురించిన రేట్ల ప్రకారం స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారులు చెల్లించవలసిన ప్రసారణ మరియు / లేక వీలింగు ఛార్జీలు అని అర్ధము.

## 10. దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ కొరకు దరఖాస్తు చేయు విధానము:

10.1 ఈ నిబంధనకు గల అనుబంధము-1 లో తెలిపినట్లుగా నోడల్ ఏజెన్సీ స్థూలంగా వివరాలను కోరుతూ (ఎస్.టి.యు.), ఓపెన్ యాక్సెస్ కొరకు దరఖాస్తు రూపమును అందుబాటులో ఉంచవలెను. దీనిని తన కార్యాలయములలో పత్రము రూపములోనూ, తన వెబ్ సైటులో ఎలక్ట్రానిక్ పద్దతిలో ముద్రించబడు రూపంలోనూ ప్రజలకు అందుబాటులో ఉంచవలెను.

10.2 దరఖాస్తుదారు, దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ కొరకు దరఖాస్తును, ఎస్.టి.యు. వద్ద దాఖలు చేయవలెను. సంబంధిత ప్రసారణ / పంపిణీ అనుమతిదారు (ల) కు దరఖాస్తు నకలును పంపవలెను. ట్యారిఫ్ ఉత్తరువులలోనూ, లేక ఎప్పటికప్పుడు ఇతర విధంగానూ మండలి నిర్ణయించినట్టి తిరిగి వాపసు చెల్లించబడని ప్రోసెసింగ్ ఫీజును దరఖాస్తుకు జతపరచవలెను.

అయితే, మండలి ప్రోసెసింగ్ ఫీజును నిర్ణయించే వరకూ, అట్టి ఫీజు రూ.10,000/- ఉండవలెను.

10.3 ఖండము 10.2 క్రింద దరఖాస్తు అందిన 24 గంటలలోపు దరఖాస్తు అందినట్లుగా నోడల్ ఏజెన్సీ రసీదును ఈయవలెను.

10.4 ఓపెన్ యాక్సెస్ దరఖాస్తును దాఖలు చేసిన మీదట, దరఖాస్తులో ఉన్న సమాచారములో ఏదేని అవసరమైన మార్పు చేయవలసి ఉన్నదని దరఖాస్తుదారుకు

తెలియవచ్చినట్లయితే, దరఖాస్తుదారు వెంటనే దానిని గురించి నోడల్ ఏజెన్సీ కి తెలియపరచవలెను:

అయితే, ఖండము 10.2 క్రింద ఇంతకు ముందే దాఖలు చేసిన దరఖాస్తులో ఉన్న సమాచారములో అవసరమైన మార్పు గురించి నోడల్ ఏజెన్సీ కి తెలియజేసిన సందర్భంలో, నోడల్ ఏజెన్సీ, ఆ దరఖాస్తు విషయంలో దరఖాస్తుదారు సదరు మార్పును గురించి తెలియజేసిన తేదీనే దరఖాస్తు అందిన తేదీగా పరిగణించవలెను.

10.5 ఒక క్యాలండరు నెలలో అందిన దరఖాస్తులన్నింటినీ, ఉదా: ఏప్రియల్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు అందిన వాటన్నింటినీ, ఒకేసారి దాఖలు చేసినట్లుగా పరిగణించవలెను. ఈ క్యాలండరు నెల (గవాక్షము) కొనసాగుతూ ఉంటుంది. ఉదా: నెలవారీ (గవాక్షము) ముగిసిన మీదట, తరువాత వచ్చే క్యాలండరు నెల (గవాక్షము) ప్రారంభం అవుతుంది.

10.6 ఇతర అనుమతిదారులతో సహా, ఇందులో ప్రమేయమున్న ఇతర ఏజెన్సీ లతో సంప్రదించి నిర్వహించిన వ్యవస్థ అధ్యయనములలో. వ్యవస్థను పటిష్ట పరచ వలసిన అవసరం లేకుండగనే కోరిన దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ ను అనుమతించవచ్చునని నిర్ధారించబడినట్లయితే, నోడల్ ఏజెన్సీ, గవాక్షము ముగిసిన 30 రోజుల లోపల దీనిని గురించి దరఖాస్తుదారు (ల)కు తెలియజేయవలెను.

* ["అయితే, కాలపరిమితి ముగిసిన 30 రోజుల లోపల దరఖాస్తుదారుకు నోడల్ ఏజెన్సీ నుండి ఏ విధమైన స్పందన లేక సమాచారము అందని యెడల, నోడల్ ఏజెన్సీ అట్టి దరఖాస్తును, అట్టి దరఖాస్తు నిబంధనల ప్రకారం, ఓపెన్ యాక్సెస్ కు అనుమతించినట్లుగా భావించవలెను".]

10.7 వ్యవస్థను **పటిష్టపరచకుండా** కోరిన దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ ను అనుమతింపజాలమని వ్యవస్థ అధ్యయనముల ఫలితాల ఆధారంగా నోడల్ ఏజెన్సీ అభిప్రాయపడినట్లయితే, నోడల్ ఏజెన్సీ, గవాక్షము ముగిసిన 30 రోజుల లోపల దీనిని గురించి దరఖాస్తుదారుకు తెలియజేయవలెను. అటు పిమ్మట, నోడల్ ఏజెన్సీ ఆ విధంగా తెలియజేసిన 15 రోజుల లోపల దరఖాస్తుదారు చేసిన అభ్యర్ధనపై, నోడల్ ఏజెన్సీ ఇందులో ప్రమేయము ఉండగల పనులను గుర్తించుటకై అవసరమైనయెడల తదుపరి అధ్యయనములను నిర్వహించవలెను. దరఖాస్తుదారు నుండి ఈ

* సవరణ నిబంధన 1/2016 ద్వారా చేర్చబడినది

విషయంలో అభ్యర్థన అందిన తేదీ నుండి 30 రోజుల లోపల అతనికి దీనిని గురించి తెలియజేయవలెను. నోడల్ ఏజెన్సీ, సంబంధిత అనుమతిదారులతో సంప్రదించిన మీదట ఇందులో ప్రమేయము ఉన్న పనులను నిర్వర్తించుటకు అవసరముకాగల సమయమును గురించి కూడా దరఖాస్తుదారుకు తెలియజేయవలెను:

అయితే, ఇట్టి సందర్భములలో, వ్యవస్థను పటిష్టపరచటంలో ప్రమేయం ఉన్న పనులను గుర్తించుటకొరకు చేసిన వ్యవస్థ అధ్యయనములకు వాస్తవంగా అయిన ఖర్చును దరఖాస్తుదారు నోడల్

ఏజెన్సీ కి తిరిగి చెల్లించవలెను. దరఖాస్తుదారు అట్లు తిరిగి చెల్లించవలసియున్న వాస్తవ ఖర్చుకు గాను ఖండము 10.2 లో నిర్దేశించినట్లుగా దరఖాస్తుదారు చెల్లించిన ఫీజును సర్దుబాటుచేయవలెను.

అంతేకాక, అట్టి వ్యవస్థ పటిష్టత కొరకు అవసరమైన పనులను గుర్తించునప్పుడు, నోడల్ ఏజెన్సీ, సందర్భానుసారంగా, గ్రిడ్ కోడు మరియు / లేక పంపిణీ కోడు మరియు / లేక భారత విద్యుత్ నియమాల ప్రకారం అవసరమైన ప్రమాణాలను అనుసరించవలెను.

## 11. స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ కొరకు దరఖాస్తు చేయు విధానము:

11.1 ఖండము 10.1 లో పేర్కొన్నటువంటి అదే మాదిరి దరఖాస్తు రూపమును, ఎస్.ఎల్.డి.సి., తన కార్యాలయములో పత్రం రూపంలోనూ, తన వెబ్ సైటు లో ఎలక్ట్రానిక్ పద్ధతిలో ముద్రించబడు రూపంలోనూ ప్రజలకు అందుబాటులో ఉంచవలెను.

11.2 ప్రసారణ మరియు / లేక పంపిణీ వ్యవస్థ (ల) తో స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ కొరకు దరఖాస్తును ఎస్.ఎల్.డి.సి. వద్ద దాఖలు చేయవలెను. సంబంధిత అనుమతిదారులకు దరఖాస్తు నకలును పంపవలెను. ట్యారిఫ్ ఉత్తరువులలోనూ, లేక ఎప్పటికప్పుడు ఇతర విధముగానూ, మండలి నిర్ణయించినట్టి తిరిగి వాపసు చెల్లింపబడని ప్రోసెసింగ్ ఫీజును దరఖాస్తుకు జతపరచవలెను:

అయితే, మండలి, ప్రోసెసింగ్ ఫీజును నిర్ణయించే వరకూ, అట్టి ఫీజు రూ.10,000/- ఉండవలెను.

11.3 ఎస్.ఎల్.డి.సి., స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ దరఖాస్తులను ఈ క్రింద తెలిపిన గడువులోపల ప్రోసెస్ చేయవలెను:

| ఓపెన్ యాక్సెస్ అవసరమైన వ్యవధి | గరిష్ట ప్రోసెసింగు సమయము |
|---|---|
| ఒక రోజు వరకూ | 12 గంటలు |
| ఒక వారము వరకూ | 2 రోజులు |
| ఒక నెల వరకూ | 7 రోజులు |
| ఒక సంవత్సరము వరకూ | 30 రోజులు |

**12. ఓపెన్ యాక్సెస్ ఒప్పందము:**

12.1 ఓపెన్ యాక్సెస్ దరఖాస్తుదారుకు, నోడల్ ఏజెన్సీ పంపిన సమాచారం ఆధారంగా దరఖాస్తుదారు సంబంధిత అనుమతిదారు (ల) తో ఓపెన్ యాక్సెస్ ఒప్పందమును కుదుర్చుకొనవలెను. ఇందులో ఈ నిబంధనకు గల అనుబంధము-2 లో కోరిన విధంగా సమాచారమును తెలుపవలెను. ఈ నిబంధన అమలులోనికి వచ్చిన 30 రోజుల లోపల అనుమతిదారుడు ప్రామాణికమైన ఒక ఓపెన్ యాక్సెస్ ఒప్పందపు రూపమును తయారుచేసి దానికి మండలి ఆమోదమును పొందవలెను.

12.2 ఖండము 12.1 లో పేర్కొన్న ఓపెన్ యాక్సెస్ ఒప్పందము, దరఖాస్తుదారు, దరఖాస్తుదారుకు చెందిన నిష్క్రమణ స్థానము ఎవరి సరఫరా ప్రాంతములో ఉన్నదో అట్టి పంపిణీ అనుమతిదారుడు మరియు సంబంధిత ప్రసారణ అనుమతిదారుడు లేక అనుమతిదారులతో కూడిన ద్వైపాక్షిక, త్రైపాక్షిక లేక బహు పాక్షిక ఒప్పందముగా ఉండవలెను. ఓపెన్ యాక్సెస్ ఒప్పందములో, ప్రసారణ మరియు పంపిణీ వ్యవస్థలలో వేరువేరుగా ఉన్న నిష్క్రమణ స్థానములకు సంబంధించి అనుబంధము-3 లో స్థూలంగా తెలిపిన అందరి భాగస్వాముల హక్కులు, బాధ్యతలను స్పష్టంగా తెలుపవలెను:

అయితే, ఓపెన్ **యాక్సెస్** దరఖాస్తుదారు(ల) యొక్క ప్రవేశ స్థానములు, అదేవిధంగా నిష్క్రమణ స్థానములు ఒకే పంపిణీ అనుమతిదారు యొక్క పంపిణీ వ్యవస్థలో (33 కె.వి. మరియు అంతకు తక్కువ ఓల్టేజీ వద్ద) ఉన్న సందర్భములలో, దరఖాస్తుదారుడు కేవలం ఆ పంపిణీ అనుమతిదారుతోనే ఓపెన్ యాక్సెస్ ఒప్పందమును కుదుర్చుకొనవలెను.

12.3 దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ దరఖాస్తుదారుడు, ఓపెన్ యాక్సెస్ ఒప్పందమును కుదుర్చుకొనుటతో సహా ముందుగా చేయవలసిన పనులన్నీ పూర్తిచేసినమీదట, అనుమతిదారు (లు) ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (అభ్యర్థనపై విద్యుత్

సరఫరా చేయుట అనుమతిదారుల కర్తవ్యము) నిబంధన, 2004 (2004 లో 3వ నిబంధన) లో నిర్దిష్ట పరచిన గడువు లోపల అందుబాటులో ఉన్న సామర్థ్యమునకు లోబడి, దరఖాస్తుదారునికి ఓపెన్ యాక్సెస్ ను అందించుటకు ఏర్పాట్లు చేయవలెను:

అయితే, **స్వల్పకాలిక** వాడకందారుల విషయంలో, పైన తెలిపిన నిబంధనలో గడువు ఏదీ నిర్దిష్ట పరచబడనప్పటికినీ, వీలైనంత త్వరలో ఓపెన్ యాక్సెస్ ను అనుమతించవలెను.

12.4 <u>ఓపెన్ యాక్సెస్ ఒప్పందము యొక్క కనీస కాల పరిమితి మరియు నవీకరణ:</u>

ఓపెన్ యాక్సెస్ ఒప్పందము యొక్క కనీస కాల పరిమితి, ఖండము 4 లోని నిబంధనలకు లోబడి ఆ ఒప్పందము లోని భాగస్వాములు, అంగీకరించి ఒప్పందములో పొందుపరచిన కాల పరిమితి అయి ఉండును. దీర్ఘకాలిక వాడకందారు మరియు అనుమతిదారుని మధ్య కుదుర్చుకొన్న దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ ఒప్పందమును, ఆ ఒప్పందము ముగియు లోపల సంబంధిత దీర్ఘకాలిక వాడకందారు నుండి సంబంధిత అనుమతిదారుకు మరియు నోడల్ ఏజెన్సీ కి కనీసం 3 నెలల నోటీసు అందిన మీదట, కొత్తగా ఓపెన్ యాక్సెస్ **దరఖాస్తును** కోరకుండా, తదుపరి రెండు లేక అంతకంటే ఎక్కువ సంవత్సరములకు నవీకరించవచ్చును. దీర్ఘకాలిక వాడకందారు ఎటువంటి నోటీసును పంపనట్లయితే, దీర్ఘకాలిక వాడకందారు తనకు కేటాయించిన సామర్థ్యంపై హక్కు కోల్పోవును.

అయితే, స్వల్పకాలిక వాడకందారుల విషయంలో మొదటి ఓపెన్ యాక్సెస్ ఒప్పందమునకు ఎట్టి పొడిగింపు **అనుమతించబడదు**. పొడిగింపు కోరుకొనే వాడకందారు ఓపెన్ యాక్సెస్ కొరకు కొత్తగా నోడల్ ఏజెన్సీ కి దరఖాస్తు చేసుకొనవలెను.

## 13. <u>మీటరింగు</u>

13.1 దీర్ఘకాలిక మరియు స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందార్లు అందరూ, ప్రవేశ మరియు నిష్క్రమణ స్థానముల వద్ద ప్రత్యేక ఎనర్జీ మీటర్లను ఏర్పాటుచేయవలెను. ఈ మీటర్లు ప్రతి 15 నిమిషాల వ్యవధికి యాక్టివ్ ఎనర్జీని, రియాక్టివ్ ఎనర్జీని, సగటు ఫ్రీక్వెన్సీ ని మరియు డిమాండు ఇంటిగ్రేషనును **కొలిచే** సామర్థ్యమును కలిగియుండి, బిల్ట్-ఇన్ క్యాలండరును, గడియారమును కలిగియుండి బి.ఐ.ఎస్./సి.బి.ఐ.పి. టెక్నికల్

రిపోర్టు/ఐ.ఐ.సి. ప్రమాణాలకు అనుకూలంగా ఉండవలెను. అయినప్పటికీ, ఇది చట్టము యొక్క 55వ పరిచ్ఛేదము క్రింద కేంద్ర విద్యుత్ ప్రాధికారము చేయునట్టి నిబంధనలకు లోబడి యుండును.

13.2 ఈ నిబంధనలోని ఖండము 7 లో తెలిపిన వాడకందారులు, ఈ నిబంధన అమలులోనికి వచ్చిన మూడు నెలల లోపల వారి ఆవరణలలో అవసరమైన మీటరింగును ఏర్పాటుచేయవలెను. అట్లు **చేయనియెడల** వారికి విద్యుత్ వీలింగు చేయవలసిన బాధ్యత అనుమతిదారులకు ఉండదు. అట్టి సందర్భములో, వాడకందారుని ఆవరణలో నమోదైన విద్యుత్తు అంతా ఆ సరఫరా ప్రాంత పంపిణీ అనుమతిదారు సరఫరా చేసినట్లుగానే భావించబడును. తదనుసారం గా సముచిత ట్యారిఫ్ తో అనుమతిదారుడు ఆ విద్యుత్తు కొరకు బిల్లు చేయవలెను:

అయితే, పంపిణీ అనుమతిదారుల విషయంలో, అధిక సంఖ్యలో వారు ఏర్పాటుచేయవలసిన **మీటర్లను** పరిగణనలోనికి తీసుకొని, ఈ విషయంలో సరియైన కారణములను తెలుపుతూ అభ్యర్థనలు అందిన మీదట, మండలి సముచితమని భావించు విధంగా మూడు నెలల గడువును పొడిగించవచ్చును.

## 14. ప్రసారణ **మరియు** పంపిణీ (టి. & డి.) నెట్ వర్కులలో అందుబాటు సామర్థ్యమును నిర్ధారించు విధానము:

14.1 ఓపెన్ యాక్సెస్ వ్యవహారముల కొరకు వీలు కలిగించే అందుబాటు సామర్థ్యమును నిర్ధారించుటకు గాను, ఓపెన్ యాక్సెస్ వాడకందారుల కొరకు ప్రస్తుతం ఒప్పుకొన్న సామర్థ్యము మరియు భవిష్యత్తులో సామర్థ్యపు అవసరాల ఉజ్జాయింపులు, పంపిణీ అనుమతిదారులు **ఉజ్జాయింపు** వేసిన లోడ్ పెరుగుదల, ఉత్పాదన (జనరేషను) పెరుగుదల, నెట్ వర్క్ టోపాలజీ మరియు వినియోగించే పద్ధతి, నెట్ వర్కు పెట్టుబడులు, మరమ్మత్తులు మరియు నిర్వహణ కార్యక్రమాలు మొదలైనవాటిని పరిగణనలోనికి తీసుకొని, అనుమతిదారులు లోడ్ ఫ్లో అధ్యయనములను, వ్యవస్థను ప్రభావితం చేయు అధ్యయనములను నిర్వర్తించవలెను. ఆ విధంగా ఓపెన్ యాక్సెస్ వ్యవహారముల కొరకు అందుబాటులో ఉన్న సామర్థ్యమును నిర్ధారించునప్పుడు, ప్రస్తుతం నెట్ వర్కును వినియోగించుకొనుచున్న వాడకందారులకు అందించే సామర్థ్యమును మరియు సిస్టమ్ రిలయబిలిటీ మార్జినును మినహాయించవలెను.

14.2 ఓపెన్ యాక్సెస్ వాడకందారులతో కుదుర్చుకొన్న ఒప్పందములను, సిస్టమ్ ఎలిమెంట్ల సామర్థ్యంపై అట్టి వ్యవహారముల ప్రభావము, నేటివ్ లోడ్ లో పెరుగుదల / తరుగుదల, వినియోగపద్ధతిలో మార్పులు, వాస్తవంగా నిర్వర్తించిన మరియు ఉజ్జాయింపు వేసిన నెట్ వర్కును పటిష్ట పరచే కార్యక్రమాలు మొదలైనవాటిని లెక్కలోనికి తీసుకొని అనుమతిదారులు అందుబాటు సామర్థ్యంపై సమాచారమును ఎప్పటికప్పుడు తాజాగా ఉంచవలెను.

14.3 దరఖాస్తు చేయబడిన ఓపెన్ యాక్సెస్ వ్యవహారమును అనుమతించుటకై టి & డి నెట్ వర్కులలో తగినంత మిగులు సామర్థ్యం యొక్క లభ్యతను నిర్ణయించుటకుగాను, నోడల్ ఏజెన్సీ, నెట్ వర్కులో అట్టి ఓపెన్ యాక్సెస్ వ్యవహారమునకు అనుబంధమైన విద్యుత్ ఫ్లో ప్రభావమును తగ్గించుటకు లోడ్ ఫ్లో అధ్యయనములను నిర్వర్తించవలెను. ఆవిధముగా, ఓపెన్ యాక్సెస్ వ్యవహారమును సందర్భానుసారంగా గ్రిడ్ కోడ్ మరియు / లేక పంపిణీ కోడు మరియు / లేక భారత విద్యుత్ నియమాల ప్రకారం సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా అనుమతించుటకు సామర్థ్యం అందుబాటులో ఉన్నదా? లేక తగినంత సామర్థ్యము ఉన్నదని తెలుసుకొనుటకు వ్యవస్థను పటిష్ట పరిచే పనులను నిర్వహించవలసిన అవసరం ఉన్నదా? అనుదానిని నిర్ధారించవలెను. నోడల్ ఏజెన్సీ ఓపెన్ యాక్సెస్ కు దరఖాస్తు అందుకొన్నప్పుడు ప్రతి సందర్భంలోనూ ఈ ప్రక్రియనంతటినీ నిర్వహించవలసి ఉండును.

14.4 అనుమతిదారులు, వారి మధ్య సమాచారమును ఇచ్చిపుచ్చుకొనవలెను. వారి వారి నెట్ వర్క్ వ్యవహారములను నోడల్ ఏజెన్సీకి తెలియపరచవలెను.

14.5 నోడల్ ఏజెన్సీలు మరియు ప్రసారణ / పంపిణీ అనుమతిదారులు, తమతమ వెబ్ సైట్లలో అందుబాటు సామర్థ్యము యొక్క వివరములను ఉంచవలెను. ఇందులో, వివిధ అనుమతిదారుల నెట్ వర్కులపై అనుమతించిన ఓపెన్ యాక్సెస్ వ్యవహారముల వివరములు మరియు వారివారి ప్రవేశ మరియు నిష్క్రమణ స్థానములు, వగైరా వివరములు రోజు వారీ ప్రాతిపదికపై ఉంచవలెను.

**15. పరిమితికంటే తక్కువ వినియోగము :**

15.1 వాడకందారు ఒప్పందపు ఓపెన్ యాక్సెస్ సామర్ధ్యము కంటే తక్కువగా వినియోగించుకొనవచ్చునని అతడు ఊహించిన సందర్భంలో, అట్లు తక్కువ వినియోగించుకొనుటకు గల వివరణతో పాటుగా ఓపెన్ యాక్సెస్ ఒప్పందములోని నిబంధనలలో తెలిపిన ముందస్తు నోటీసును ఇచ్చుటకు లోబడి, వాడకందారు సామర్ధ్యములో కొంత భాగమును వెనుకకు ఇచ్చివేయవచ్చును.

15.2 ఓపెన్ యాక్సెస్ వాడకందారు ఒప్పందపు సామర్ధ్యం కంటే తక్కువ వినియోగించుకొన్న సంధర్భంలో, అది అందుబాటులోనికి వచ్చినయెడల, ఇతర దరఖాస్తుదారు(ల) అవసరాలకు దానిని ఉపయోగించగలిగినట్లయితే, సంబంధిత అనుమతిదారుడు, ఓపెన్ యాక్సెస్ వాడకందారునికి కేటాయించిన సామర్ధ్యమును తగ్గించుటకు లేక రద్దుచేయుటకు నోడల్ ఏజెన్సీకి దరఖాస్తుచేయవచ్చును.

అయితే, అనుమతిదారు, **ఓపెన్** యాక్సెస్ ఒప్పందములో తెలిపిన విధంగా సంబంధిత వాడకందారుకు ముందుగా నోటీసును ఈయకుండా నోడల్ ఏజెన్సీ వద్దకు వెళ్లరాదు.

అంతేకాక, **నోడల్** ఏజెన్సీ, సంబందిత ఓపెన్ యాక్సెస్ వాడకందారుకు అతని అభ్యంతరాలను వ్రాతపూర్వకంగా దాఖలు చేయుటకు వీలుగా కనీసం 15 రోజుల ముందుగా నోటీసును ఈయకుండా కేటాయించబడిన సామర్ధ్యమును తగ్గించరాదు లేక రద్దుచేయరాదు.

15.3 ఖండము 15.1 ప్రకారం వాడకందారు ఒప్పందపు సామర్ధ్యమును పూర్తిగా లేక కొంతభాగమును వదులుకొన్న సందర్భములో లేక ఖండము 15.2 ప్రకారం వాడకందారుకు కేటాయించిన సామర్ధ్యమును తగ్గించిన / రద్దు చేసిన సందర్భంలో వాడకందారు సంబంధిత అనుమతిదారులకు ఈ క్రింది విధంగా నష్టపరిహార చార్జీలను చెల్లించవలెను:

(ఏ) వాడకందారు లేక సందర్భానుసారంగా, అనుమతిదారుడు ఇచ్చిన నోటీసు వ్యవధి లోపల వదులుకొన్న లేక తగ్గించిన/రద్దు చేసిన సామర్ధ్యం అంతా పూర్తిగా ఇతర దరఖాస్తుదారులకు తిరిగి కేటాయించబడినట్లయితే, దీర్ఘకాలిక లేక సందర్భానుసారంగా స్వల్పకాలిక వాడకందార్ల దరఖాస్తు ఫీజులో 50% మొత్తము.

(బి) నోటీసు వ్యవధిలోపల, వదులుకొన్న లేక తగ్గించిన / రద్దు చేసిన సామర్ధ్యమును ఇతర దరఖాస్తుదారులకు పూర్తిగా తిరిగి కేటాయించలేకపోయినట్లయితే, ----

(i) దీర్ఘకాలిక వాడకందారుల విషయంలో ఒప్పందము ప్రకారం మిగిలిన వ్యవధికి చెందిన సామర్ధ్యంలో తిరిగి కేటాయించలేకపోయిన సామర్ధ్యంపై వర్తించే ప్రసారణ ఛార్జీలు మరియు / లేక సందర్భానుసారంగా, వీలింగు చార్జీలలో 25% మరియు ఆ సమయంలో అమలులో ఉన్న షెడ్యూలింగు మరియు వ్యవస్థ నిర్వహణ చార్జీలను ఏక మొత్తం నిష్క్రమణ ఫీజుగా వాడకందారు చెల్లించవలెను.

(ii)స్వల్పకాలిక వాడకందారుల విషయంలో, ఒప్పందము ప్రకారం మిగిలిన వ్యవధికి చెందిన సామర్ధ్యంలో తిరిగి కేటాయించలేకపోయిన సామర్ధ్యంపై వర్తించే పూర్తి ప్రసారణ ఛార్జీలు మరియు / లేక సందర్భానుసారంగా, వీలింగు ఛార్జీలు మరియు ఆ సమయంలో అమలులో ఉన్న షెడ్యూలింగు మరియు వ్యవస్థ నిర్వహణ చార్జీలను వాడకందారు భరించవలెను.

## 16. ప్రవేశ మరియు నిష్క్రమణ స్థానములను మార్చుకొనే వెసులుబాటు:

16.1 దీర్ఘకాలిక వాడకం దారులు కోరిన ప్రకారం సంబంధిత అనుమతిదారులు నిర్వహించిన వ్యవస్థను ప్రభావితము చేయు అధ్యయనముల ఫలితములకు లోబడి, అట్టి వాడకందారులు సంవత్సరంలో రెండు పర్యాయములు ప్రవేశ మరియు / లేక నిష్క్రమణ స్థానములను మార్చుకొనే అవకాశం ఉండవలెను. అట్టి అధ్యయనములను చేయుట కొరకు **అనుమతిదారులు** భరించిన ఖర్చులను అట్టి వినియోగదారులు ప్రతి పూర్తి చెల్లింపు చేయవలెను.

16.2 ఒక పూర్తి సంవత్సరానికి ఓపెన్ యాక్సెస్ వినియోగించుకొనే స్వల్పకాలిక వాడకందారులు **కూడా**, అవకాశమును బట్టి, ప్రవేశ మరియు/ లేక నిష్క్రమణ స్థానములను రెండు పర్యాయములు మార్చుకొనవచ్చును.

## 17. ఓపెన్ యాక్సెస్ ఛార్జీలు:

17.1 ప్రసారణ మరియు / లేక పంపిణీ వ్యవస్థను ఓపెన్ యాక్సెస్ వాడకందారు ఉపయోగించుకొన్నందుకు చార్జీలను ఈ క్రింది విధముగా క్రమబద్ధీకరించవలెను:

(i) ప్రసారణ/పంపిణీ వ్యవస్థకు అనుసంధానం చేయబడిన ఓపెన్ యాక్సెస్ వాడకందారులు, ప్రసారణ చార్జీలను మరియు / లేక వీలింగు చార్జీలను మరియు మండలి ఎప్పటికప్పుడు నిర్ధారించి సంబంధిత ట్యారిఫ్ ఉత్తరువులో లేక ఇతర విధముగా ప్రకటించిన ఏవేని ఇతర చార్జీలను అందులో నిర్దేశించిన షరతుల ప్రకారం చెల్లించవలెను:

అయితే, ఆ విధంగా చెల్లించవలసిన వీలింగు ఛార్జీలు, మండలి సంబంధిత ట్యారిఫ్ ఉత్తరువులో లేక ఇతర విధంగా నిర్ణయించిన కనీస స్థాయికి లోబడి ఉండవలెను.

*["అంతేకాక, జి.ఓ.ఎమ్.ఎస్.నం.8, తేదీ 12.2.2015 మరియు జి.ఓ.ఎమ్.ఎస్.నం.9, తేదీ 13.2.2015 లలో తెలిపినట్లుగా అట్టి విధానములు అమలులో ఉన్న కాలంలో సౌర మరియు పవన విద్యుత్తు ప్రాజెక్టుల నుండి ఉత్పత్తి అయిన విద్యుత్తు వీలింగు కొరకు, క్యాప్టివ్ వినియోగమునకు / రాష్ట్రం లోపల తృతీయ వ్యక్తికి అమ్మకమునకు సంబంధించి మాత్రమే ప్రసారణ మరియు వీలింగు చార్జీలను మినహాయించవలెను".]

*["అంతేకాక, ఇంకనూ, డిస్కమ్ పరిధిలోపల నిష్క్రమణ స్థానము వద్ద ఓల్టేజి స్థాయితో సంబంధము లేకుండా, 33 కె.వి. లేక అంతకు లోపల జి.ఓ.ఎమ్.ఎస్.నం.8, తేదీ 12.2.2015 లో తెలిపిన అట్టి విధానములు అమలుకాలంలో విద్యుత్తును అందిస్తున్న సౌర విద్యుత్ ప్రాజెక్టులకు పంపిణీ నష్టములను మినహాయించవలెను".]

(ii) రాష్ట్రంలోపల ప్రసారణ వ్యవస్థ మరియు / లేక పంపిణీ వ్యవస్థకు అదనంగా అంతర్ రాష్ట్ర ప్రసారణ వ్యవస్థను ఓపెన్ యాక్సెస్ వాడకందారు వినియోగించుకొన్న సందర్భంలో, అంతర్ రాష్ట్ర ప్రసారణ వ్యవస్థను వినియోగించుకొన్నందుకు అయిన చార్జీలకు అదనంగా రాష్ట్రం లోపలి వ్యవస్థను వినియోగించుకొన్నందుకు చెల్లించవలసిన ప్రసారణ ఛార్జీలు మరియు / లేక పంపిణీ చార్జీలను చెల్లించవలసి యుండును.

(iii) ప్రసారణ మరియు / లేక పంపిణీ వ్యవస్థ యొక్క ఓపెన్ యాక్సెస్ వాడకందారులు, అట్టి ఓపెన్ యాక్సెస్ ద్వారా పంపిణీ అనుమతిదారుని సరఫరా ప్రాంతములో ఉన్న



* సవరణ నిబంధన 1/2016 ద్వారా చేర్చబడినది

వినియోగదారుని ఆవరణలోనికి విద్యుత్తును తరలించిన సందర్భంలో, చట్టం యొక్క 42 (2) పరిచ్ఛేధము ప్రకారం మండలి ఎప్పటికప్పుడు నిర్ధారించిన క్రాస్ సబ్సిడీ సర్ చార్జిని పంపిణీ అనుమతిదారునికి చెల్లించవలెను:

అయితే, తన స్వంత వినియోగము కొరకు గమ్యస్థానమునకు విద్యుత్తును తరలించుటకై క్యాప్టివ్ ఉత్పాదన ప్లాంటును స్థాపించిన వ్యక్తికి ఓపెన్ యాక్సెస్ ను ఏర్పాటుచేసిన యెడల ఏ విధమైన (క్రాస్ సబ్సిడి) సర్ చార్జిని చెల్లించనవసరములేదు.

*["అంతేకాక, జి.ఓ.ఎమ్.ఎస్.నం.8, తేదీ 12.2.2015 లో తెలిపినట్లుగా రాష్ట్రం లోపల ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్రోజెక్టుల నుండి ఉత్పత్తి అయిన విద్యుత్తుకు అట్టి ప్రోజెక్టులు ప్రారంభమైన తేదీ నుండి అయిదు సంవత్సరముల వ్యవధి వరకూ తృతీయ వ్యక్తికి చేసిన అమ్మకమునకు సంబంధించి క్రాస్-సబ్సిడీ సర్-ఛార్జీ మరియు అదనపు సర్ చార్జీలను మినహాయించవలెను".]

(iv) ఓపెన్ యాక్సెస్ వాడకందారు, వినియోగదారుని సరఫరా ప్రాంతంలోని పంపిణీ అనుమతిదారుడు కాకుండా ఇతర వ్యక్తి నుండి సరఫరాను పొందుటకు, ఓపెన్ యాక్సెస్ ను కోరినప్పుడు, సరఫరా భాధ్యత మూలంగా పంపిణీ అనుమతిదారుకు అయిన స్థిర వ్యయమును భరించుటకు గాను వీలింగు చార్జీలపై చట్టము యొక్క 42 (4) పరిచ్ఛేధము క్రింద మండలి ఆయా సమయములయందు నిర్దేశించిన అదనపు సర్ చార్జీని కూడా చెల్లించవలసియుండును.

(v) ఓపెన్ యాక్సెస్ వాడకందారుకు విద్యుత్ సరఫరాను అందించుటకు గాను అనుమతిదారుడు విద్యుత్ ప్లాంటును లేక విద్యుత్ లైనును నిర్మించవలసియున్నప్పుడు, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (అభ్యర్ధనపై విద్యుత్తును సరఫరా చేయుట అనుమతిదారుని కర్తవ్యము) నిబంధన, 2004 (2004 లో 3వ నిబంధన) ప్రకారం అనుమతిదారుడు అట్టి వ్యయమును వసూలు చేయవచ్చును.

(vi) దరఖాస్తుదారుకు యాక్సెస్ ను ఏర్పాటు చేయుటకు గాను నెట్ వర్కును వృద్ధి చేయవలసిన అవసరం ఉన్నయెడల:



* సవరణ నిబంధన 1/2016 ద్వారా చేర్చబడినది

(ఏ) అనుమతిదారుడు అట్టి వృద్ధికి సంబంధించిన ఖర్చును, మూలధన పెట్టుబడిని మరియు మూలధన పెట్టుబడిపై తగిన ప్రతిఫలమును సముచితమైన సమయములోపల తిరిగి వసూలు చేయగలిగినట్లయితే, మరియు

(బి) అనుమతిదారుకు అట్టి పెట్టుబడి వ్యయము కొరకు నిధులను సేకరించే సామర్ధ్యము ఉన్నట్లయితే మాత్రమే అనుమతిదారు అట్టి నెట్ వర్కును వృద్ధి చేయుటను చేపట్టవలెను:

అయితే, అనుమతిదారు ఆ నెట్ వర్క్ వృద్ధి చేయుట కొరకు పెట్టుబడిని సమకూర్చవలసినదిగా ఓపెన్ యాక్సెస్ వాడకందారును కోరవచ్చును.

(vii) ఎస్.ఎల్.డి.సి. చేయు షెడ్యూలింగు క్రింద ఓపెన్ యాక్సెస్ వాడకందారులందరూ షెడ్యూలింగు మరియు వ్యవస్థ నిర్వహణ చార్జీలను,చెల్లించవలసియుండును. అట్టి ఛార్జీలు మండలిచే జారీ చేయబడు సంబంధిత నిబంధనల ద్వారా నిర్ణయించబడును.

## 18. చెల్లింపు నిబంధనలు మరియు షరతులు:

18.1 దీర్ఘకాలిక వాడకందారుల విషయంలో సంబంధిత పంపిణీ అనుమతిదారుడు, ఈ నిబంధనలోని ఖండము 17లో తెలిపిన ఓపెన్ యాక్సెస్ చార్జీలకు సంబంధించి వాడకందారునికి బిల్లు చేయవచ్చును. ఓపెన్ యాక్సెస్ వాడకందారు అనుమతిదారులకూ, వాడకందారునికీ మధ్య ఉన్న ఓపెన్ యాక్సెస్ ఒప్పందములో తెలిపిన విధానము ప్రకారం ఆ చార్జీలను చెల్లించవలెను:

అయితే, పంపిణీ అనుమతిదారు వాడకందారు నుండి వసూలు చేసిన ప్రసారణ చార్జీలను **సంబంధిత** ప్రసారణ అనుమతిదారునికి పంపుటకు గాను ప్రసారణ అనుమతిదారులతో సముచితమైన ఏర్పాట్లు చేసుకొని ఉండవలెను.

18.2 స్వల్పకాలిక వాడకందారుల విషయంలో, పంపిణీ అనుమతిదారు(లు) వాడకందారునికి బిల్లు చేయవచ్చును. వాడకందారు ఆ చార్జీలను సంబంధిత అనుమతిదారు(ల)కు నేరుగా చెల్లించవలెను. విద్యుత్తు లెక్కలు (అక్కౌంటింగు) మరియు కేటాయింపు విషయంలో ఎస్.ఎల్.డి.సి., పంపిణీ అనుమతిదారునికి సహాయమును / సలహాను అందించవలెను

18.3 ఓపెన్ యాక్సెస్ ఒప్పందములో తెలిపిన తేదీ నుండి ఓపెన్ యాక్సెస్ వాడుకొనబడుతున్నదా? లేదా ? అను దానితో సంబంధములేకుండా, అట్టి ఓపెన్ యాక్సెస్ వాడుకొనలేకపోవుటకు సంబంధిత నెట్ వర్కు అనుమతిదారు (ల) వైఫల్యము కారణము అయిననే తప్ప, ఓపెన్ యాక్సెస్ వాడకందారులందరూ ఓపెన్ యాక్సెస్ ఒప్పందములో తెలిపిన ప్రారంభపు తేదీ నుండి ఒప్పందము క్రింద చెల్లించవలసిన చార్జీలను చెల్లించవలెను.

18.4 తక్కువ వినియోగించుకొన్న కారణంగా ఒప్పందపు సామర్థ్యము వదులుకొన్న లేక రద్దయిన **సందర్భంలో**, వాడకందారు ఖండము 15 లో తెలిపిన రీతిలో అట్టి చార్జీలను చెల్లించవలెను.

18.5 వినియోగదారులకు సరఫరా చేయుటకొరకు ఓపెన్ యాక్సెస్ కు సంబంధించి మీటరు **రీడింగులు** మరియు బిల్లింగు:

వినియోగదారుడు ఉన్న ప్రాంతపు పంపిణీ అనుమతిదారుడు విడుదల స్థానము వద్ద మీటరు **రీడింగులను** తీసుకొనవలెను. ఈ నిబంధనలోని ఖండములు 12, 17 మరియు 20 ల క్రింద ఓపెన్ యాక్సెస్ ఒప్పందము ప్రకారం సంబంధిత అనుమతిదారులు బిల్లింగు చేయవలెను.

18.6 ఖండము 18.5 ప్రయోజనము నిమిత్తము, పంపిణీ అనుమతిదారు తో గరిష్ట ఒప్పందపు డిమాండు (సి.ఎమ్.డి.) లే నప్పటికీ తన పూర్తి విద్యుత్ అవసరాలకొరకు ప్రసారణ మరియు/లేక పంపిణీ వ్యవస్థలను వినియోగించుకొనుచున్న వినియోగదారుణ్ణి, అతడు ఉన్న సరఫరా ప్రాంతపు పంపిణీ అనుమతిదారు యొక్క వినియోగదారుడుగా భావించవలెను.

**19. ఇతర అంశములు:**

19.1 అనుమతిదారులు మరియు ఎస్.ఎల్.డి.సి. మధ్య సమన్వయము:

ఓపెన్ యాక్సెస్ అమలును సఫలము చేయుట కొరకు అనుమతిదారులు మరియు రాష్ట్ర లోడు విడుదల కేంద్రము కలసి ఓపెన్ యాక్సెస్ వ్యవహారముల స్థాయిని నిర్ధారించుట కొరకు వారివారి సంబంధిత సరఫరా ప్రాంతములలో ఎనర్జీ ఫ్లోలు, ప్రసారణ మరియు పంపిణీ లైన్లు మరియు వ్యవస్థ సుస్థిరతను నిర్ధారించు పరికరములు,

అందుబాటులో ఉన్న సామర్థ్యము, నెట్ వర్కులలో ఉన్న రద్దీ మొదలైన వాటి గురించి వారి మధ్య రోజు వారీ సమాచారమును మార్పిడి చేసుకొనవలెను.

19.2 సమాచార అవసరం:

అనుమతిదారులు మరియు రాష్ట్ర లోడు విడుదల కేంద్రము పారదర్శకతను పాటించుటకొరకు ఈ క్రింది సమాచారమును వారి వెబ్ సైట్లలో ఉంచవలెను మరియు ఓపెన్ యాక్సెస్ దరఖాస్తులను ప్రోసెస్ చేయుటకు అవసరమైన సమాచారమును వారి మధ్య మార్పిడి చేసుకొనవలెను:

(i) రాష్ట్రంలోని ఓపెన్ యాక్సెస్ వాడకందారుల కొరకు సందర్భానుసారముగా ప్రసారణ మరియు / లేక వీలింగు ఛార్జీలు; మరియు

(ii)వాడకందారుని పేరు, మంజూరైన యాక్సెస్ వ్యవధి (ప్రారంభపు తేదీ మరియు ముగింపు తేదీ), విద్యుత్తును పంపే స్థానము(లు) మరియు పొందే స్థానము(లు), ఒప్పందపు సామర్థ్యము మరియు వర్తింపదగు ఛార్జీలు మొదలగువాటిని తెలుపుతూ ప్రస్తుత దీర్ఘకాలిక వాడకందారుల స్థితిపై నివేదిక. ఈ స్థితిలో మార్పులు వచ్చినపుడు నివేదికలో ఎప్పటికప్పుడు ఆ మార్పులను చేర్చవలెను; మరియు

(iii) ప్రాంతముల మధ్య లింకుల వాడకమునకు సంబంధించిన సమాచారము. అదే విధంగా కేంద్ర ప్రసారణ సంస్థ మరియు రాష్ట్ర వ్యవస్థల మధ్య సమాచారము, అప్ డేటింగు సమయము, లింకు పేరు, లింకు యొక్క పూర్తి ప్రసారణ సామర్థ్యము, షెడ్యూల్డు సామర్థ్యపు వాడకము మరియు వాడకంలో ఉన్న లింకు ప్రస్తుత సామర్థ్యములను తెలుపుతూ అంతర్ రాష్ట్ర లింకుల సమాచారము. ఈ సమాచారమును కనీసం గంటల వారీగా వీలైన యెడల 15 నిమిషాల వారీగా మార్పులను చేర్చవలెను.

19.3 సరఫరా లో నాణ్యత:

అనుమతిదారులు, వర్తించదగినచోట గ్రిడ్ నియమావళిని పాటించునట్లు చూడవలెను. పంపిణీ అనుమతిదారులు తమ నెట్ వర్కులోని ఓపెన్ యాక్సెస్ వాడకందార్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (అనుమతిదారుల పనితీరు ప్రమాణాలు) నిబంధన, 2004 (2004 లోని 7వ నిబంధన) లో నిర్ణీతపరచిన సరఫరా ప్రమాణములను కూడా పాటించవలెను.

19.4 విద్యుత్తు మరియు డిమాండు సమతౌల్యం:

ఓపెన్ యాక్సెస్ వాడకందారులు మరియు ఖండము 7.2 లో తెలిపిన వాడకందారులు అందరూ, ఒక ఇంటర్ కనెక్షను వద్ద వారి వాస్తవ డిమాండు గాని లేక సందర్భానుసారంగా వాస్తవంగా పంపిన సామర్థ్యం గాని, గరిష్ట ఒప్పందపు డిమాండును లేక ఆ ఇంటర్-కనెక్షను కొరకు కేటాయించబడి పంపిన సామర్థ్యమును గాని మించకుండా ఉండునట్లు తగిన ప్రయత్నము చేయవలెను:

అయితే, ఓపెన్ యాక్సెస్ ఒప్పందములకు సంబంధించిన అన్ని ప్రవేశ మరియు నిష్క్రమణ **స్థానముల** వద్ద విద్యుత్తు మరియు డిమాండు సమతుల్యత మరియు పరిష్కారమును నిర్వహించుట కొరకు అనుమతిదారుడు, మండలిచే ఆయా సమయములయందు ఆమోదించబడు సమతుల్య మరియు పరిష్కార నియమావళిని ఖచ్చితముగా పాటించవలెను.

19.5 నిరోధముల కారణంగా తగ్గింపు:

అనుమతిదారు, ఎస్.ఎల్.డి.సి. నుండి అందిన ఆదేశములపై, గ్రిడ్ భద్రతకు, సుస్థిరతకు ప్రమాదము వాటిల్లే **అత్యవసర** పరిస్థితిలో దీర్ఘకాలిక లేక స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారుకు లేక వాడకందారులకు, విద్యుత్తును తగ్గించవచ్చును. ఆచరణీయమైనంత మేరకు తగ్గింపులో ప్రాధాన్యత ఈ క్రింద తెలిపిన విధముగా ఉండవలెను:

(ఏ) నెట్ వర్కులోని స్వల్పకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారులకు ముందుగా తగ్గించవలెను, తదుపరి

(బి) దీర్ఘకాలిక ఓపెన్ యాక్సెస్ వాడకందారులతో సహా ఇతర వినియోగదారులందరూ. అయితే ఒప్పందపు వ్యవధుల అవరోహణ క్రమంలో పంపిణీ అనుమతిదారులను మినహాయించవలెను, తదుపరి

(సి) పంపిణీ **అనుమతిదారులు**

## 20. సాధారణ సరఫరా నిబంధనలు మరియు షరతులు:

ఇందులో లేని అంశములకు సంబంధించి, ఈ క్రింద తెలిపిన వాటికే పరిమితము కాకుండా వాటితో సహా, మరియు సందర్భమును బట్టి అవసరమైనచోట, సాధారణ సరఫరా నిబంధనలు **మరియు** షరతులలో తెలిపిన షరతులను వర్తించవలెను:

(ఏ) సరఫరా ఓల్టేజి ప్రతిగా మొత్తము ఒప్పందపు డిమాండు;

(బి) పూచీ ధరావతు;

(సి) ఛార్జీలు చెల్లించనందుకు కనెక్షను తొలగింపు;

(డి) ఉత్తరాధికార వ్యక్తికి హక్కు బదిలీ; మరియు

(ఇ) వినియోగదారు చార్జీల విధింపు, వసూలు.

**21. <u>వివాద పరిష్కారము:</u>**

వివాదములు, ఫిర్యాదులు అన్నింటిని పరిష్కారము కొరకు నోడల్ ఏజెన్సీ కి పంపవలెను:

అయితే, నోడల్ ఏజెన్సీయే వివాదములో ఒక కక్షిదారైనప్పుడు, ఆ వివాదమును, 2004 లోని 1వ **నిబంధన** క్రింద ఏర్పాటైన వినియోగదారుల సమస్యల పరిష్కార ఫోరం కు పరిష్కారము కొరకు పంపవలెను:

**అంతేకాక**, క్యాప్టివ్ ఉత్పాదన ప్లాంట్ల నుండి విద్యుత్తును వీలింగు చేసే సందర్భంలో, ప్రసారణ సౌకర్యము అందుబాటుకు సంబంధించిన వివాదములను మండలి న్యాయ నిర్ణయము చేయవలెను.

**22. <u>ప్రకృతి వైపరీత్యముల వంటి అనివార్యమైన పరిస్థితులు:</u>**

22.1 యుద్ధము, తిరుగుబాటు, పౌరకల్లోలం, దోపిడీ, వరదలు, తుఫాను, మెరుపులు, భూకంపము మరియు సమ్మె, లాక్ అవుటు, ఆవరణకు, యంత్ర పరికరములకు నష్టము కలిగించే అగ్ని ప్రమాదము మరియు ఓపెన్ యాక్సెస్ ఒప్పందము కలిగియున్న వాడకందారుల కార్యకలాపములు వంటివి ఈ నిబంధన నిమిత్తము నియంత్రణలో లేని పరిస్థితులై ఉండును.

22.2 ఓపెన్ యాక్సెస్ ఒప్పందమునకు భాగస్వామి అయిన వ్యక్తి, పైన తెలిపిన అనివార్యమైన పరిస్థితులు ఏర్పడిన కారణంగా అట్టి ఓపెన్ యాక్సెస్ ఒప్పందము క్రింద లేక ఈ నిబంధన క్రింద ఏదేని బాధ్యతను నిర్వర్తించవలసిన సమయము లోపల పూర్తిగాగాని, కొంత భాగమును గాని నిర్వర్తించలేకపోయినంత కాలమూ ఆ బాధ్యత అంతమేరకు నిలిపివేయబడినట్లుగా భావించవలెను.

**23. ఉత్తరువులు మరియు ఆచరణీయ ఆదేశముల జారీ:**

కేంద్ర విద్యుత్ చట్టము, 2003, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణ చట్టము, 1998 మరియు ఈ నిబంధనకు లోబడి, ఈ నిబంధనను అమలు పరచుటకు అనుసరించవలసిన కార్యవిధానమును మరియు ఇతర విషయములకు సంబంధించి, ఈ నిబంధన ద్వారా ఆదేశించుటకు లేక నిర్దేశించుటకు మండలికి అధికారమీయబడిన అన్ని విషయాలపై మండలి ఆయా సమయములయందు ఉత్తరువులను మరియు ఆచరణీయ ఆదేశములను జారీచేయవచ్చును.

**24. ఇబ్బందులను తొలగించుటకు అధికారము:**

24.1 ఈ నిబంధనలలో దేనినైనను అమలుపరచుటలో ఇబ్బంది ఏర్పడిన యెడల, ఆ ఇబ్బందిని తొలగించుటకు చట్టముయొక్క నిబంధనలకు విరుద్ధముగా కాకుండా మండలి తాము అవసరము లేక వాంఛనీయమని భావించునట్టి తగిన చర్య తీసుకొనుటకు మండలి, సాధారణ లేక ప్రత్యేక ఉత్తరువు ద్వారా, ఓపెన్ యాక్సెస్ వాడకందార్లను, ఉత్పాదకులను మరియు అనుమతిదారులను ఆదేశించవచ్చును.

24.2 ఓపెన్ యాక్సెస్ వాడకందారులు, ఉత్పాదకులు మరియు అనుమతిదారులు మండలికి దరఖాస్తు చేసి ఈ నిబంధనను అమలుపరచుటలో ఏర్పడే ఇబ్బందులను తొలగించుటకొరకు తగిన ఉత్తరువులను కోరవచ్చును.

**25. మినహాయింపు:**

ఈ నిబంధనలో ఉన్నదేదియూ, వినియోగదారుల రక్షణ చట్టము, 1986 (1986 లో 68వ చట్టము) తో సహా ఆ సమయమునందు అమలులో ఉన్న ఏదేని ఇతర చట్టము క్రింద వాడకందారులకు ఉన్న హక్కులకు మరియు విశేష అధికారములకు భంగము కలిగించదు.

**26. సవరణ అధికారము:**

మండలి ఆయా సమయములయందు ఈ నిబంధనలను తగు విధంగా సవరించవచ్చును.

# అనుబంధము – 1

## ఓపెన్ యాక్సెస్ దరఖాస్తులో సూచించవలసిన వివరములు

(ఏ) (i) దరఖాస్తుదారుని పేరు, చిరునామా :

(ii) దరఖాస్తుదారు యొక్క స్థాపన వివరములు :

(iii) వీలింగు స్వభావము అనగా క్యాప్టివ్ వాడకం కొరకా లేక ఇతరులకు అమ్మకానికా? :

(iv) విద్యుత్ వీలింగు చేయబడుతున్న వినియోగదారుల పేరు, చిరునామా :

(బి) అవసరమైన ఓపెన్ యాక్సెస్ వివరం: దీర్ఘకాలికంగా లేక స్వల్పకాలికంగా :

(సి) ప్రతి వినియోగదారుకు సంబంధించి ఓపెన్ యాక్సెస్ కొరకు అవసరమైన సామర్థ్యం కి.వా. లో లేక మె.వా. లో :

(డి) ప్రవేశ స్థానము (లు) :

(ఇ) నిష్క్రమణ స్థానము (లు) :

(ఎఫ్) ఓపెన్ యాక్సెస్ ఎంతకాలము అవసరము :

(జి) ఎప్పటికప్పుడు సవరించబడిన విధంగా, మీటరింగు కోడు (గ్రిడ్ కోడ్ లో భాగము లేక సందర్భానుసారంగా పంపిణీ కోడు) ప్రకారం అవసరమైన విధంగా ప్రవేశ స్థానముల వద్ద మరియు నిష్క్రమణ స్థానముల వద్ద మీటరింగు ఏర్పాట్ల వివరములు :

(హెచ్) విద్యుత్తును పొందుతున్న వారు పంపిణీ అనుమతిదారుని సరఫరా ప్రాంతములో ముందుగానే వినియోగదారులా అన్నదానిపై సమాచారము. అయినచో, సంబంధిత పంపిణీ అనుమతిదారుతో ప్రతి వినియోగదారుని ఒప్పందపు గరిష్ట డిమాండు (సి.ఎమ్.డి.) ను తెలుపవలెను:

అనుమతిదారు/నోడల్ ఏజెన్సీ సముచితంగా కోరే ఇతర సమాచారము.

## అనుబంధము – 2

### ఓపెన్ యాక్సెస్ ఒప్పందములో సూచించిన అవసరమైన ప్రత్యేకతలు

(ఏ) ప్రవేశ మరియు నిష్క్రమణ స్థానములు :

(బి) ప్రసారణ మరియు / లేక పంపిణీ వ్యవస్థలో ఓపెన్ యాక్సెస్ కొరకు కేటాయించిన సామర్థ్యం (కి.వా. లేక మె.వా. లో) :

(సి) వివిధ యాక్సెస్ సర్వీసులను ఏర్పాటుచేయుట కొరకు ధరలు, ఛార్జీలు :

- (i) సందర్భానుసారంగా ప్రసారణ మరియు / లేక వీలింగు ఛార్జీలు;
- (ii) మినహాయించవలసిన ప్రసారణ నష్టాలు మరియు / లేక వీలింగు నష్టాలు;
- (iii) క్రాస్-సబ్సిడీ సర్ చార్జి;
- (iv) అదనపు సర్ చార్జి;
- (v) ఎస్.ఎల్.డి.సి. ఛార్జీలు;
- (vi) రియాక్టివ్ ఎనర్జీ ఛార్జీలు, వర్తించునట్లయితే; మరియు
- (vii) ఏవేని ఇతర ఛార్జీలు.

(డి) ఒప్పందపు పూర్తి కాలంలో అన్ని వేళలా గ్రిడ్ కోడు మరియు / లేక సందర్భానుసారంగా పంపిణీ కోడు నిబంధనలను దరఖాస్తుదారు యొక్క పరికరములు / స్థాపనలు పాటించవలసిన అవసరం.

(ఇ) ఓపెన్ యాక్సెస్ ప్రారంభ తేది

(ఎఫ్) బ్యాలన్సింగ్ మరియు సెటిల్మెంటు కోడు ప్రకారం మండలి ఆయా సమయములయందు ఆమోదించవలసిన ఎనర్జీ మరియు డిమాండు బ్యాలన్సింగ్ విధానాలను లెక్కించే రీతి

(జి) బిల్లింగు వ్యవధి మరియు చెల్లింపు నిబంధనలు, షరతులు

(హెచ్) ఒప్పందపు వ్యవధి మరియు దాని సమాప్తి / డిరేషను షరతులు

(ఐ) సామర్థ్యమును వదులుకొనుట, ఓపెన్ యాక్సెస్ ఒప్పందమును ముందుగా సమాప్తి చేయుట, కేటాయించిన సామర్థ్యము కంటే తక్కువగా వినియోగించుకొన్నందుకు జరిమానా మొదలగు

వాటిపై నోడల్ ఏజెన్సీ యొక్క అధికారములతో సహా ఇతర నిబంధనలు మరియు షరతులు

(జె) వర్తించే కేసుల విషయంలో ఓపెన్ యాక్సెస్ ఒప్పందపు నవీకరణ కొరకు ఏర్పాటు

అనుమతిదారుడు సముచితమని భావించునట్టి ఇతర సమాచారము

## అనుబంధము – 3

**నిబంధనలోని ఖండము 12.2 లో పేర్కొన్న త్రైపాక్షిక ఓపెన్ యాక్సెస్ ఒప్పందముల విషయంలో ఇతర విషయాలతో పాటుగా భాగస్వాముల కర్తవ్యములు, హక్కులుమరియు బాధ్యతలు**

132 కె.వి. మరియు అంతకంటే ఎక్కువ కె.వి. పై నిష్క్రమణ స్థానములు ఉన్న చోటు (ప్రసారణ వ్యవస్థ):

( ఏ) ప్రసారణ సామర్థ్యమును ఏర్పాటు చేయుట సంబంధిత ప్రసారణ అనుమతిదారు బాధ్యత – ఒప్పందపు ప్రసారణ సామర్థ్యముపై వాడకందారుని హక్కు;

( బి) సరఫరా ప్రాంతములో నిష్క్రమణ స్థానము ఉన్నచోట (ప్రసారణ ఛార్జీలు, సర్ ఛార్జీలు ఔట్ ఆఫ్ బ్యాలన్సింగ్ చెల్లింపులు మొదలైనవాటి) బిల్లింగు కొరకు ఆ సరఫరా ప్రాంతపు పంపిణీ అనుమతిదారుని కర్తవ్యములు ;

( సి) బిల్లు చేసిన విధంగా చార్జీలను చెల్లించుట వాడకందారుని కర్తవ్యము; మరియు

( డి) వాడకందారు నుండి వసూలు చేసిన ప్రసారణ చార్జీలను సంబంధిత ప్రసారణ అనుమతిదారుకు అందించుట పంపిణీ అనుమతిదారుని కర్తవ్యము.

32 కె.వి. మరియు అంతకంటే తక్కువ కె.వి. పై నిష్క్రమణ స్థానములు ఉన్న చోటు (పంపిణీ వ్యవస్థ):

( ఏ) ప్రసారణ సామర్థ్యమును ఏర్పాటు చేయుట సంబంధిత ప్రసారణ అనుమతిదారు బాధ్యత – ఒప్పందపు ప్రసారణ సామర్థ్యముపై వాడకందారుని హక్కు;

( బి) పంపిణీ వ్యవస్థ సామర్థ్యమును ఏర్పాటు చేయుట సంబంధిత పంపిణీ అనుమతిదారుని బాధ్యత;

(సి) మీటరు రీడింగు మరియు (ప్రసారణ ఛార్జీలు, వీలింగు ఛార్జీలు, వర్తించదగు సర్ ఛార్జీలు, ఔట్ ఆఫ్ బ్యాలన్స్ చెల్లింపులు మొదలైనవాటి) బిల్లింగుకు సంబంధించి పంపిణీ అనుమతిదారుని కర్తవ్యములు;

(డి) బిల్లు చేయబడిన విధంగా చార్జీలను చెల్లించుట వాడకందారుని కర్తవ్యము; మరియు

(ఇ) **వాడకందారు** నుండి వసూలు చేసిన ప్రసారణ చార్జీలను సంబంధిత ప్రసారణ అనుమతిదారుకు అందించుట పంపిణీ అనుమతిదారుని బాధ్యత.

(మండలి ఉత్తరువు మేరకు జారీచేయబడినది)

హైదరాబాదు — ఎస్. సూర్యప్రకాశరావు

తేదీ. 30.6.2005 — కార్యదర్శి

**గమనిక**: నిబంధన యొక్క ఈ తెలుగు అనువాదము ప్రజా సౌకర్యం నిమిత్తం చేసిన స్వేచ్ఛానువాదము మాత్రమే. అధికారిక పాఠం కాదు.